సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



చివరాఖరికి కదలిక

కలెక్టర్ షణ్మోహన్ సోమవారం దేవస్థానంలోని వివిధ విభాగాల్లో తనిఖీలు చేయడంతో అన్నవరం దేవస్థానం అధికారుల్లో చలనం వచ్చింది.


8లో



మృత్యువు వీడదీయని స్నేహ బంధం

కలిసిమెలిసి తిరుగుతూ జీవితాన్ని ఆస్వాదిస్తున్న ఇద్దరు మిత్రులు ఆర్టీసీ బస్సు ఢీకొని దుర్మరణం పాలైన ఘటన ధవళేశ్వరంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

డెల్టాలకు 8,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 4,200 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మద్యం అమ్మకాలు బంద్

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 125 మద్యం షాపులు, 22 బార్లను మంగళవారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. మద్యం షాపులు, బార్లను ఆయా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు సీల్ వేశారని వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ అనంతరం గురువారం సాయంత్రం 4 గంటల తరువాత మద్యం షాపులు, బార్లు తిరిగి తెరుస్తామని పేర్కొన్నారు.

విద్యా సంస్థలకు రేపు సెలవు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జిల్లాలోని ఉప, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ విషయం గమనించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

కాకినాడ సిటీ: ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించాలని, ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశించారు. వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) కార్యకలాపాలపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం వివరాలను ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జె.ఎలియాజర్ తెలిపాశారు. ప్రకృతి వ్యవసాయం కింద పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పుస్తకాలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలో 6,500 హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం కింద రైతులు వరి సాగు చేస్తున్నారన్నారు. రానున్న ఖరీఫ్‌లో 73,834 ఎకరాల్లో వరి, మామిడి, జీడిమామిడి, పండ్లు, కూరగాయలు సాగు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసి, మరింత మంది ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ ఏడీ మల్లికార్జునరావు, ఏపీఎంఐపీ డీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాలీ'బాల్'మే సవాల్



గొల్లవిల్లిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ముస్తాబైన వాలీబాల్ కోర్టు

ఉప్పలగుప్తం: ఆలిండియా పురుషుల వాలీబాల్ పోటీల నిర్వహణకు ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో సర్వం సిద్ధమైంది. అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా ఈ పోటీలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి మార్చి ఒకటి వరకు ఈ పోటీలు డే అండ్ నైట్ పద్ధతిలో జరగనున్నాయి. ఈ పోటీలు గొల్లవిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదిక కాబోతోంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు గొల్లవిల్లి జెడ్పీ మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కోర్టు నిర్మించారు. సుమారు ఐదు వేల మంది వీక్షించేలా గ్యాలరీ నిర్మాణం చేశారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీల్లో జీఎస్టీ (ముంబాయి), కర్ణాటక స్పైకర్స్, కేరళ స్పైకర్స్, ఇండియన్ బ్యాంకు(చెన్నై), ఇన్‌కం ట్యాక్స్ (చెన్నై), హూపర్స్ స్పోర్ట్స్ క్లబ్ (ముంబాయి) జట్లు పాల్గొననున్నాయి. అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన సుమారు 20 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనున్నారని నిర్వాహకులు తెలిపారు.

నాలుగు దశాబ్దాల క్రితం

గొల్లవిల్లిలో నాలుగు దశాబ్దాల క్రితం కోనసీమ స్థాయిలో వాలీబాల్ పోటీలు మొదలయ్యాయి. 1988లో యూఎస్ఎస్ఆర్ మెమోరియల్ పేరుతో తొలిసారిగా కోనసీమ స్థాయిలో ఇక్కడ వాలీబాల్ టోర్నమెంట్ ఆరంభమైంది. 1990లో కోనసీమ, 1991 తూర్పుగోదావరి జిల్లా, 1992 ఉభయ గోదావరి జిల్లాలు, 1993 నుంచి 2001 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. 2012న తిరిగి ఎస్‌పీఆర్ మెమోరియల్ పేరుతో రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. 2017 నుంచి ఎన్‌వీఆర్ పేరుతో నాలుగేళ్ల పాటు జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. తాజాగా అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరోసారి జాతీయ పోటీల నిర్వహణ చేపట్టారు.



విద్యుద్దీప కాంతుల్లో ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం

ఉత్సవాలకు ముస్తాబైన ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయం

ప్రతి ఊరూ.. శివమయం

- నేడు మహా శివరాత్రి పర్వదినం
- జిల్లాలో ముస్తాబైన శైవక్షేత్రాలు
- గోదావరి పుణ్యస్నానాలకు పోటెత్తనున్న భక్తులు
- ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పావన గోదావరి జలాలతో పునీతమవుతున్న ఈ నేలపై.. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆధ్యాత్మిక వాహిని పరవళ్లు తొక్కనుంది. హరహర మహాదేవ శంభోశంకర.. అంటూ భక్తుల శివనామస్మరణ ప్రతి ఊరిలో ప్రతిధ్వనించనుంది. వేకువజామునే భక్తులు పావన గోదావరి నదీ జలాలు, కాలువ, ఆలయాల పుష్కరిణుల్లో పుణ్యస్నానాలు ఆచరించి, శివయ్య అనుగ్రహం కోసం ఆ స్వామి ఆలయాలకు పరుగులు తీయనున్నారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి, తమను చల్లగా చూడాలని భక్తి ప్రపత్తులతో వేడుకోనున్నారు. శివరాత్రి వేడుకలకు జిల్లాలోని అన్ని శివాలయాలూ ముస్తాబయ్యాయి.

ఘాట్లలో పూర్తయిన ఏర్పాట్లు

మహా శివరాత్రి వేళ గోదావరి నదిలో వేలాదిగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. వారి కోసం ఆయా ఘాట్లలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాజమహేంద్రవరం నగరంలోని పుష్కర ఘాట్, కోటిలింగాలు, సరస్వతి, వీఐపీ, గౌతమ ఘాట్లతో పాటు కొవ్వూరులోని గోష్పాద క్షేత్రానికి కూడా స్థానికులతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు.

సుప్రసిద్ధ శైవక్షేత్రాలెన్నో..

- రాజమహేంద్రవరం నగరంలో గోదావరి తీరాన కోటిలింగాలపేటలో శ్రీ భువనేశ్వరీ సహిత ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. బ్రహ్మదేవుడే విప్రుని వేషంలో వచ్చి ఇక్కడ కోటిలింగాలు ప్రతిష్ఠించాడని, అందులో ఒకటి మాయమవడంతో మహర్షులు కాశీ నుంచి ఒక శివలింగాన్ని తెచ్చి ప్రతిష్ఠించారని, అదే ఆలయంలో ప్రస్తుతం పూజలందుకుంటున్న కోటిలింగేశ్వర స్వామి లింగమని చెబుతారు. బ్రహ్మాండ పురాణం ప్రకారం త్రిపురాసుర సంహారం ఇక్కడే జరిగింది. కోటిలింగ క్షేత్రానికి అభినవ విరూపాక్ష పీఠమనే పేరు కూడా ప్రాచుర్యంలో ఉంది.
- నగరంలో గోదావరి గట్టున ఉన్న శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయానికి ప్రాచీన చరిత్ర ఉంది. మార్కండేయుని భక్తికి మెచ్చి పరమేశ్వరుడు ఇక్కడే సాక్షాత్కరించాడని, అందుకే ఈ స్వామికి మార్కండేయేశ్వరుడనే పేరు వచ్చిందని అంటారు. ప్రాచీన కాలంలో ఈ ఆలయం చందా సత్రం ఎదుట ఉన్న మసీదులో ఉండేది. దీనిని గుండు శోభనాద్రి జమీందారు 1775లో ప్రస్తుతం ఉన్న స్థలానికి తరలించి, కొత్త ఆలయం నిర్మించారు.
- రాజమహేంద్రిని రాజధానిగా చేసుకొని రాజరాజ నరేంద్రుడు వేంగి దేశాన్ని పరిపాలించేవాడు. అతడికి సారంగధరుడనే కుమారుడున్నాడు. రాజరాజ నరేంద్రునికి రెండో భార్య చిత్రాంగి. ఆమె కారణంగా సారంగధరుడికి రెండు కాళ్లు, చేతులు తొలగించాలని రాజు ఆజ్ఞాపించాడు. ప్రస్తుతం నగరంలోని కోరుకొండ రోడ్డులో ఉన్న కొండ మీద సారంగధరుడి కాళ్లు, చేతులు తొలగించారని, అతడు ఆర్తితో ప్రార్థించగా పరమ శివుడు ప్రత్యక్షమై సారంగధరుడికి కాళ్లు, చేతులు తిరిగి ప్రసాదించాడని, అందువల్లనే ఇక్కడ వెలసిన స్వామికి సారంగధరేశ్వరుడనే పేరు వచ్చిందని చెబుతారు.
- రాజమహేంద్రవరం నగరంలో శృంగేరి జగద్గురు శంకర మఠం శారదా పీఠంలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్ఫటిక లింగం కూడా ఎంతో ప్రాశస్త్యమైనది. ఇంకా క్వారీ మార్కెట్ సెంటర్, జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, గోదావరి తీరాన కొత్తగా నిర్మించిన రోటరీ మహాకాళేశ్వరాలయం (ఉజ్జయిని ఆలయం), టి.నగర్‌లో శ్రీ బాలాత్రిపుర సుందరీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం కూడా ఈ నగరంలో కొలువు దీరాయి. అలాగే, దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని గౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఇటీవల సుమారు రూ.7 కోట్లతో పునర్నిర్మించారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఈసారి మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

దేవదాయ భూమి అన్యాక్రాంతానికి యత్నం!


మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆరోపణ



రాజమహేంద్రవరం సిటీ: విలువైన భూమిని అన్యాక్రాంతం చేసేందుకు కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నట్లు అనుమానం కలుగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయ శాఖ పరిధిలోని పందిరి మహాదేవుడు సత్రానికి స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులో నాలుగెకరాల భూమి ఉందన్నారు. కోట్లాది రూపాయల విలువైన ఈ భూమిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మేనమామ ఇంట్లో పెళ్లి కోసం ఏ ప్రాతిపదికన ఇచ్చారో చెప్పాలని దేవదాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. లీజుకు వేలం వేసిన దాఖలాలు కూడా లేవన్నారు. గతంలో ఈ స్థలం లీజు వేలానికి దేవదాయ శాఖ అధికారులు ప్రయత్నించారని, ఆ సందర్భంగా తక్కువ రేటుకు కొట్టేసేందుకు కొందరు ప్రయత్నించారని తెలిపారు. అప్పుడు ఎంపీగా ఉన్న తాను ఈ లీజు ప్రయత్నానికి అడ్డుకట్ట వేసి, ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడానని పేర్కొన్నారు. ఇప్పుడు అదే స్థలాన్ని శుభ్రం చేసి, ఎమ్మెల్యే వాసు బంధువు ఇంట్లో పెళ్లి కోసం ఇవ్వడం వింతగా ఉందన్నారు. రూ.కోట్ల విలువైన ఈ స్థలాన్ని పెళ్లిళ్ల కోసం, పార్కింగ్ కోసం వినియోగించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. దీని వెనుక ఏ లావాదేవీలు జరిగాయో తేల్చాలని డిమాండ్ చేశారు. ఎవరూ పట్టించుకోకపోతే ఈ స్థలం అన్యాక్రాంతమవడం ఖాయమని అనుమానం వ్యక్తం చేశారు. దేవదాయ భూములు, స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, దాతల ఆశయాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని భరత్‌రామ్ డిమాండ్ చేశారు.

ఆంధ్రా శబరిమలైలో ఆదియోగి

- ద్వారపూడిలో భారీ ముక్కంటి విగ్రహం ఏర్పాటు
- 60 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పు
- రూ.50 లక్షల వ్యయం
- దేశంలోనే మూడో అతిపెద్ద విగ్రహం
- నేడు ప్రారంభం



ద్వారపూడిలో నేడు ప్రారంభం కానున్న ఆదియోగి విగ్రహం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆంధ్రా శబరిమలైగా పేరొందిన ద్వారపూడికి మరింత శోభను తెస్తూ నిలువెత్తు ఆదియోగి విగ్రహం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్రంలో మొదటి, దేశంలో మూడో అతి పెద్దదిగా, యోగముద్రలో ఈ ముక్కంటి విగ్రహాన్ని తీర్చిదిద్దారు. మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం దీనిని ప్రారంభించనున్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా..

వస్త్ర మార్కెట్‌కు పేరొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్వారపూడిలో ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి 1983లో అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించారు. సింహం నోటిలో నుంచి దుర్గామాత ఆలయానికి, సింహం జూలుపై నుంచి అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లేలా నిర్మించడం దీని ప్రత్యేకత. కేరళలోని శబరిమలై వెళ్లలేని స్వాములు రాష్ట్రం నలుమూలల నుంచీ ఇక్కడకు వచ్చి ఇరుముడులు సమర్పిస్తూండటంతో అనతి కాలంలోనే ఇది ఆంధ్రా శబరిమలైగా గుర్తింపు పొందింది. తర్వాతి కాలంలో ఈ ప్రాంగణంలో దుర్గాదేవి, పంచముఖాంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు 40 అడుగుల ఏకశిలా శివలింగం, శివాలయం, భూగర్భ జ్యోతిర్లింగాలయం, సాయిబాబా, నక్షత్రాలయం, నాగమ్మతల్లి తదితర 35కు పైగా ఆలయాలను ఇక్కడ నిర్మించారు. దీంతో ద్వారపూడి ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది.

ఔరా! అనిపించేలా..

శివాలయాన్ని ఆనుకుని అతిపెద్ద ఆదియోగి విగ్రహం ఏర్పాటుకు గత ఏడాది జనవరి 3న ఆలయ కమిటీ శ్రీకారం చుట్టింది. అనపర్తి మండలం కొమరిపాలేనికి చెందిన శిల్పి వీర రాఘవ ఆధ్వర్యాన నిరాటంకంగా విగ్రహం నిర్మాణం జరిగింది. కింది భాగంలో స్లాబ్ వేసి నవదుర్గా మాతల విగ్రహాలు ఏర్పాటు చేశారు. పైభాగంలో 100 అడుగుల వెడల్పు, 60 అడుగుల ఎత్తులో ఆదియోగి విగ్రహం ఉంటుంది. చుట్టూ గణనాథుడు, కుమారస్వామి, సప్తర్షుల విగ్రహాలుంటాయి. విగ్రహం లోపలి భాగంలో శివలింగాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అక్కడ కూర్చుని ధ్యానం చేసుకునేలా ఏర్పాటు చేశారు. విగ్రహం తయారీకి రూ.25 లక్షలు, స్లాబ్, ఇతర నిర్మాణాలకు రూ.25 లక్షలు ఖర్చయ్యింది. దేశంలోనే అతి పెద్ద ఆదియోగం విగ్రహం కోయంబత్తూరులో 112 అడుగుల పొడవు, 82 అడుగులు ఎత్తుతో ఉంది. రెండో స్థానంలో బెంగళూరులోని విగ్రహం ఉండగా, మూడోదిగా ద్వారపూడిలో ఆదియోగి విగ్రహం యోగముద్రలో రూపొందించారు. ఈ విగ్రహాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వస్తున్నారు. సెల్ఫీలు తీసుకుని మురిసిపోతున్నారు.

కూటమిలో కలవరం



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంపై అంతర్మథనం
- నిరుద్యోగులు, ఉద్యోగులు, వలంటీర్లకు కూటమి సర్కారు దగా
- వైఫల్యాల నడుమ ఎన్నికల్లో మద్దతిస్తారా అని మల్లగుల్లాలు
- ముగిసిన ప్రచారం.. రేపు పోలింగ్
- బరిలో 35 మంది అభ్యర్థులు
- పీడీఎఫ్, కూటమి మధ్యే పోటీ

సాక్షి, రాజమహేంద్రవరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెర పడింది. పోలింగ్ గురువారం జరగనుంది. ఈ తరుణంలో కూటమి నేతల్లో తాము మద్దతిస్తున్న అభ్యర్థి విజయంపై కలవరం మొదలైంది. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు పూర్తయినా హామీలు అమలు చేయకపోవడం, సచివాలయ ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరించడం, వలంటీర్ల పొట్ట కొట్టడం, మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం వంటి పరిణామాల నేపథ్యంలో అన్ని వర్గాల్లోనూ కూటమి సర్కారుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్యనే ప్రధానంగా పోటీ నెలకొంది. మొన్నటి వరకూ విజయం తనదేనని భావించిన కూటమి అభ్యర్థికి ప్రస్తుతం ఆందోళన మొదలైంది.

హామీల అమలేదీ?

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలు గుప్పించింది. జాబ్ క్యాలెండర్ ప్రకటించి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పింది. ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నా ఒక్క ఉద్యోగం, నయాపైసా నిరుద్యోగ భృతి చెల్లించిన దాఖలాలు లేవు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగుల ఓట్లే కీలకం కానున్నాయి. తమను అన్ని విధాలా మోసం చేసిన కూటమి అభ్యర్థికి ఎందుకు ఓట్లు వేయాలని వారు భావిస్తున్నారు.

మెగా పేరుతో దగా

కూటమి ప్రభుత్వం 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పింది. నేటికీ ఆ దిశగా చర్యలు లేవు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. డీఎస్సీ ప్రకటించకపోగా రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల్లో ఉన్న ఉద్యోగుల్లో కోత పెట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయని రూ.వేలకు వేలు వెచ్చించి శిక్షణ పొందిన నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమను దగా చేసిన కూటమి అభ్యర్థికి ఓట్లు ఎందుకు వేయాలని ప్రశ్నిస్తున్నారు.

సచివాలయ ఉద్యోగులకు వేధింపులు

ప్రభుత్వ సంక్షేమ ఫలాలను గుమ్మం వద్దనే అందించేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకు వచ్చిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. హేతుబద్ధీకరణ పేరిట నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుంది. ఇప్పటికే ఉద్యోగులతో జాబ్‌చార్ట్‌లో లేని పనులు చేయిస్తూ ఒత్తిళ్లకు గురి చేస్తోంది. తాజాగా ఉద్యోగుల కుదింపునకు శ్రీకారం చుట్టింది. ఒక్కో సచివాలయంలో ఇద్దరు ముగ్గురి ఉద్యోగాలకు ఎసరు పెట్టింది. జిల్లా వ్యాప్తంగా 1,417 మంది ఉద్యోగులకు స్థానచలనం కలగనుంది. దీనిపై సచివాలయ ఉద్యోగులు సైతం గుర్రుగా ఉన్నారు.


వలంటీర్లకు మంగళం

సంక్షేమ పథకాల అమలును సులభతరం చేసేందుకు, ఇంటి వద్దనే పథకాల సమాచారం, పింఛన్లు అందజేసేందుకు ప్రతి 50 కుటుంబాలకు ఒక గ్రామ, వార్డు వలంటీర్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించింది. ఎన్నికల్లో తాము నెగ్గితే వారికి రూ.10 వేల వేతనం ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. తీరా అధికారం చేపట్టాక వారి ఉద్యోగాలు తొలగించి, రోడ్డున పడేశారు. ప్రభుత్వ చర్యపై వలంటీర్లు రగిలిపోతున్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని ఓడించాలని వారు నిర్ణయించుకున్నారు.

కూటమి నేతల కుయుక్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడంతో పాటు భవిష్యత్తులో పథకాలు అందాలంటే తమ అభ్యర్థికే ఓట్లు వేయాలని కార్యకర్తల ద్వారా బెదిరింపులకు దిగినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వ పాలనపై సర్వత్రా తీవ్ర అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో గెలిచేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని అధిష్ఠానం అల్టిమేటం జారీ చేయడంతో కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు రంగంలోకి దిగారు. ప్రతి 30 మంది ఓటర్లకు ఒక టీడీపీ కార్యకర్తను ఏర్పాటు చేసి, ఓటర్లను కలిసి ఫొటో దిగి గ్రూప్‌లో అప్‌లోడ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు బరితెగించి మరీ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ప్రచారాలు చేపట్టారు. కొన్నిచోట్ల ఎన్నికల కోడ్‌ను సైతం ఉల్లంఘించారు. అసోసియేషన్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని కూటమి అభ్యర్థికే ఓట్లు వేయాలని లేకుంటే మీ పనులేం జరగవని హెచ్చరించిన సందర్భాలు సైతం ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులను సైతం హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ ఓట్లు అభ్యర్థించారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి నార్కో కో ఆర్డినేషన్ సెంటర్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బస్సులు, రైళ్లలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రవాణా అవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డ్రగ్స్ కంట్రోలర్ ఆధ్వర్యాన వినియోగంలో లేని స్టోర్లు, ఫ్యాక్టరీల వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, ఇతర వసతి గృహాల్లో నిఘా పెంచాలన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ, జిల్లాలో 2,700 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సుమారు 900 మంది గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నారు. రాజమహేంద్రవరం, సీతానగరం, గోకవరం వంటి ప్రాంతాల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీసు శాఖ సమన్వయంతో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం, నిడదవోలుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పోలీస్, ఎక్సైజ్, ఇతర అనుబంధ శాఖలతో అంతర్గత బృందాలను నియమించి, నిఘా పటిష్టం చేయాలని అన్నారు.

ఘనమై.. ఆదర్శ వరమై..

- ఉమ్మడి జిల్లాలో శంఖవరం, హంసవరంలో ఆదర్శ పాఠశాలలు
- ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్
- ఆన్‌లైన్‌లో విద్యార్థుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం


శంఖవరంలో ఏపీ మోడల్ స్కూల్ భవనం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్య అందాలనే సత్సంకల్పంతో ఏపీ మోడల్ పాఠశాలలను 2013లో ప్రారంభించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుతం పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధనతో పాటు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో శంఖవరం మండలం శంఖవరం, తుని మండలం హంసవరంలో ఆదర్శ పాఠశాలలున్నాయి. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశానికి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది.

దరఖాస్తులకు ఆహ్వానం

మోడల్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ మార్చి 31 వరకు కొనసాగుతుంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థి అర్హతను పరిశీలించి, అర్హుడని తేలితే క్రెడిట్, డెబిట్‌కార్డులు, నెట్ బ్యాంకింగ్ ఉపయోగించి గేట్‌వే ద్వారా రుసుం చెల్లిస్తే, ఓ జర్నల్ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ఆధారంగా www.cse.ap.gov.in లేదా www.apms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. తర్వాత నకలును పాఠశాలలో సమర్పించాల్సి ఉంటుంది.

ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష

ఆరో తరగతి ప్రవేశానికి గతేడాది మాదిరిగానే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్‌లోనే పరీక్ష ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. మెరిట్ లిస్ట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లను కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్ లిస్ట్, అదే రోజు సెలెక్షన్ లిస్టును వెల్లడిస్తారు. ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు, కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి తరగతులు మొదలవుతాయి.

ఇక్కడ సీటుకు చాలా డిమాండ్

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కూడా ఉన్నత చదువును అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయంగా ఏపీ మోడల్ పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఆయా పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశం పొందితే, ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించడంతో పాటు, విద్యా కానుక కిట్లు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తారు. పూర్తి ఇంగ్లిష్ మీడియంతో సత్ఫలితాలను సాధిస్తున్న మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ పొందడం అంత ఈజీ కాదు. ప్రైవేట్ పాఠశాలల్లో ఎంత ఖర్చు పెట్టినా అందుబాటులో లేని నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య.. ఇక్కడ లభ్యం కావడం పేద పిల్లలకు వరంగా మారింది.

లభించే సదుపాయాలివే..

- నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన
- కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఐదు ఎకరాల సువిశాల ప్రాంగణాల్లో భవనాలు
- ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియం విద్యా బోధన
- సౌకర్యవంతంగా విశాల తరగతి గదులు, విద్యార్థులకు ఉచిత విద్య
- బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు పూర్తి స్థాయి పరికరాలతో వేర్వేరుగా ల్యాబ్‌లు
- నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ
- స్పోకెన్ ఇంగ్లిష్, చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ
- అన్ని సదుపాయాలతో గ్రంథాలయం
- ఎల్‌సీడీ ప్రొజెక్టర్‌తో విద్యా బోధన, డిజిటల్ విద్యా విధానం

ఎవరు అర్హులంటే..

ఓసీ, బీసీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీలు రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలి. ప్రభుత్వం లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా ఐదో తరగతి చదివి ఉండాలి. ప్రవేశ పరీక్షలో ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు వచ్చి ఉండాలి.

- తొమ్మిదో తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు

నాణ్యమైన విద్యా బోధన




పేద విద్యార్థులకు మోడల్ పాఠశాలలు బంగారు భవిష్యత్తు ఇస్తాయి. ఐదో తరగతి పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ఇందులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మోడల్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో హంసవరం, శంఖవరంలో మోడల్ స్కూళ్లు నిర్వహిస్తున్నాం. నాణ్యమైన విద్యా బోధనతో పాటు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా ఇస్తారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రమేష్, జిల్లా విద్యా శాఖాధికారి, కాకినాడ

చివరాఖరికి కదలిక

- రత్నగిరిపై కలెక్టర్ తనిఖీతో అధికారుల్లో చలనం
- దేవస్థానం ర్యాంకు తగ్గడంపై అసంతృప్తి
- వివిధ విభాగాలను పరిశీలించిన ఈఓ


సోమవారం డార్మెట్రీ వద్ద టాయిలెట్స్‌ను పరిశీలించి, అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

అన్నవరం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ దేవస్థానం అధికారుల్లో చలనం వచ్చింది. రాష్ట్రంలోని ఏడు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో రత్నగిరికి చివరి ర్యాంకు రావడంతో, దేవస్థానంలో మార్పు తెచ్చేందుకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆయన దేవస్థానంలోని వివిధ విభాగాల్లో తనిఖీలు చేశారు. భక్తులతో నేరుగా మాట్లాడారు. వసతి గదుల విభాగంలో అవకతవకలు ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దేవస్థానంలో తీసుకునే ప్రతి కీలక నిర్ణయాన్ని కలెక్టర్ పరిశీలించనున్నారు. దేవస్థానంలో ఆయా విభాగాల అధికారులపై వేటుకూ వెనుకాడని పరిస్థితులు నెలకొనడంతో ఆయా వర్గాల్లో కదలిక మొదలైంది. కాగా దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఇతర అధికారులతో కలసి అన్నదాన విభాగం, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ సత్రాల్లో మరమ్మతులు చేయాల్సిన గదులు, పాత మెయిన్ గెస్ట్‌హౌస్ వెనుక టాయిలెట్స్‌ను మంగళవారం పరిశీలించారు. మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈఓ వెంట ఈఈ రామకృష్ణ, ఇతర అధికారులున్నారు.

బఫే పద్ధతిలో భోజనాలు

అన్నదానం విభాగంలో భక్తులకు భోజనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించిన విషయం విదితమే. దీనిపై అన్నదానం హాలు మొదటి అంతస్తులో కొందరు భక్తులకు బఫే పద్ధతిలో భోజనాలు పెడతామని అధికారులు తెలిపారు. దీనిపై ఈఓ సుబ్బారావు అన్నదాన విభాగాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాల తరలింపు కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. భక్తులు వెళ్లేందుకు మెట్లు కూడా నిర్మించాలి.

వచ్చే నెలలో మరోసారి తనిఖీ..!

జిల్లా కలెక్టర్ వచ్చే నెలలో కూడా దేవస్థానంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఈసారీ ఆకస్మిక తనిఖీలు చేస్తారని దేవస్థాన వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితులు గాడిన పడే వరకు ప్రతి నెలా దేవస్థానానికి వస్తానని కలెక్టర్ చెప్పిన విషయం విదితమే. సోమవారం కలెక్టర్ పర్యటన ముందుగా నిర్ణయించినది కావడంతో దేవస్థానం అధికారులు జాగ్రత్త పడ్డారనే ప్రచారం సాగుతోంది. ఇలాఉండగా ఈ నెలాఖరు నుంచి వచ్చే నెలాఖరు వరకు సత్యదేవుని ఆలయానికి విచ్చేసిన భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం సమాచారం సేకరించనుంది. దాని ఆధారంగా మరలా ర్యాంకులు కేటాయిస్తారు. తొలి మూడు ర్యాంకుల్లో అన్నవరం దేవస్థానం ఉండేలా సేవలు మెరుగుపడాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని యువకుడి మృతి


శ్యామ్‌ప్రసాద్ (ఫైల్)

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు, కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన చిక్కాల శ్యామ్‌ప్రసాద్(29) వేంపాడు సమీపంలో సుబి ఇన్‌ఫ్రా ఫ్యాబ్రికేషన్ వర్క్‌షాపులో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బైక్‌పై టోల్ ప్లాజా వద్ద టీ పాయింట్‌కు వెళ్తుండగా, వెనుక నుంచి లారీ ఢీకొంది. బైక్ నడుపుతున్న శ్యామ్‌ప్రసాద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న స్నేహితుడు సాయిబాబాకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోలీసులు నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సన్నిబాబు తెలిపారు.

పోలవరం కాలువ పనుల అడ్డగింపు


తాళ్లూరు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, రైతులు


డీఈ మురళీకి సమస్యలు వివరిస్తున్న ఆందోళనకారులు

బ్రిడ్జి నిర్మించాలని ఆందోళనకారుల డిమాండ్

తుని రూరల్: వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకం పనులను తుని మండలం తాళ్లూరు వద్ద రైతులు, గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. తమ పొలాలకు, ఇళ్లకు వెళ్లేందుకు రహదారి మార్గం లేకుండా కాలువ నిర్మిస్తుండడంతో తాళ్లూరు గ్రామస్తులు ఈ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూసేకరణలో తమ గ్రామానికి చెందిన 300 ఎకరాలు ఇచ్చామన్నారు. మిగిలిన 400 ఎకరాలు సాగు చేస్తూ బతుకుతున్నామని చెప్పారు. కాలువకు ఓవైపు భూములు, జగనన్న కాలనీ, గ్రామ దేవత గుడి, లక్ష్మీనారాయణ గుడి, మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర వసతి గృహం(నిర్మాణంలో ఉంది) ఉండగా, మరోవైపు గ్రామమంతా ఉందని వివరించారు. గ్రామస్తులు కాలనీకి, వ్యవసాయ పనుల కోసం పొలాలకు, గుళ్లకు వెళ్లాలన్నా కాలువ దాటుకుని వెళ్లాల్సి ఉందన్నారు. అందుకు అనువుగా వంతెన నిర్మించిన తర్వాతే, పోలవరం కాలువ పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. పదేళ్లుగా తమ సమస్యను పట్టించుకోకపోవడంతోనే పనులను అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు. తమ సమస్యలను పరిష్కరిస్తేనే, కాలువ పనులకు సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో సంఘటన స్థలానికి పోలవరం కాలువ డీఈ మురళీ, ఏఈ డాక్టర్ మహేష్‌కుమార్, ఇతర అధికారులు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. గ్రామస్తులు, రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వారు తెలిపారు. స్పష్టమైన హామీ వచ్చే వరకు పనులు చేపట్టవద్దని ఆందోళనకారులు భీష్మించారు. అప్పటికే రాళ్లను పేల్చేందుకు అమర్చిన పేలుడు సామగ్రిని తొలగించడం సాధ్యం కాదని, పేలుళ్లు పూర్తయ్యాక పనులు నిలిపివేస్తామని అధికారులు చెప్పడంతో, ఆందోళనకారులు అంగీకరించి, అక్కడి నుంచి నిష్క్రమించారు.

ఫీల్డ్ ఆపరేటర్ కార్మికుల నిరాహార దీక్ష


ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న సురేష్‌కుమార్, కార్మికులు

- ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వద్ద ఆందోళన
- వేతన సవరణ చేయాలని పీఈయూ నేత సురేష్‌కుమార్ డిమాండ్

రాజమహేంద్రవరం రూరల్: వేతన సవరణ కోసం ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్‌లో పనిచేస్తున్న 360 మంది ఫీల్డ్ ఆపరేటర్ కార్మికులు ఆందోళన ముమ్మరం చేశారు. యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో, మంగళవారం ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వద్ద ఆందోళనకు ఉపక్రమించారు. పెట్రోలియం ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ కొడవటి సురేష్‌కుమార్ సారథ్యంలో కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ, ఫీల్డ్ ఆపరేటర్ కార్మికులకు ప్రతి నాలుగేళ్లకు వేతన సవరణ జరగాల్సి ఉందన్నారు. 2019కి చివరగా వేతన సవరణ అసంపూర్తిగా జరిగినందున ప్రతి కార్మికునికి రూ.4,050 జీతం తక్కువగా అందుతోందన్నారు. 2023 జనవరి ఒకటి నుంచి కొత్త వేతన సవరణ జరగాల్సి ఉందన్నారు. దీనిపై యాజమాన్యం నుంచి ఎటువంటి ఫలితం లేకపోవడంతో, ఈ ఏడాది జనవరిలో యాజమాన్యానికి నోటీసులు అందజేశామన్నారు. యాజమాన్యం కొంత సమయం కోరడంతో ఇప్పటివరకు సంయమనం పాటించామన్నారు. పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో నిరహార దీక్ష చేపట్టాల్సి వచ్చిందన్నారు. వేతన సవరణతో పాటు, ఇతర కార్మిక డిమాండ్లపై మంగళవారం సాయంత్రం యాజమాన్యానికి నిరవధిక సమ్మె నోటీసు అందజేశామని సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం నుంచి దశలవారీగా నిరసనలు తెలుపుతూ, మార్చి 12 నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించామన్నారు. యూనియన్ రాజమండ్రి అసెట్ జనరల్ సెక్రటరీ జి.ప్రశాంత్‌కుమార్, ఇతర కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయంలో కానుకల చోరీ కేసులో జైలు

తిరుత్తణి: ఆలయంలో వినూత్నంగా కానుకలు చోరీ చేసిన వ్యక్తికి ఆరేళ్ల జైలు శిక్షను విధిస్తూ తిరుత్తణి కోర్టు తీర్పు వెలువరించింది. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గతేడాది ఏప్రిల్‌లో కొండ ఆలయ హుండీల్లో భక్తులు చెల్లించే కానుకలను ఓ వ్యక్తి నూలు సంచిలో పడేలా హుండీ లోపలి భాగంలో ఏర్పాటు చేస్తున్నట్టు సీసీ కెమెరాల్లో ఆలయ అధికారులు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుత్తణి పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం సిద్యాలయ గ్రామానికి చెందిన జేమ్స్ శ్యామ్ వేల్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. తిరుత్తణి క్రిమినల్ కోర్టులో జరిగిన కేసు విచారణలో నేరం రుజువైంది. నిందితుడికి ఆరేళ్ల పాటు జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ముత్తురాజ్ తీర్పు చెప్పారు.

రాగి జావ తాగి విద్యార్థులకు అస్వస్థత

- గోప్యంగా ఉంచేందుకు హెచ్ఎం యత్నం
- జగ్గిరాజుపేట స్కూల్‌లో ఘటన


చల్లపల్లి ఎంపీపీ స్కూల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పలగుప్తం: చల్లపల్లి పంచాయతీలోని జగ్గిరాజుపేట మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఉదయం అల్పాహారంగా ఇచ్చిన రాగి జావ తాగి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలకు మొత్తం 26 మంది విద్యార్థులు హాజరవ్వగా, 14 మంది వాంతులతో అస్వస్థతకు గురవ్వడం చర్చనీయాంశమైంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే కుక్ ముందుగా ఇంటి వద్దే ఆహారం తయారు చేసి, ఫంక్షన్‌కు వెళ్లడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని హెచ్ఎం వరలక్ష్మి తెలిపారు. హెచ్ఎం అందించిన సరకులతోనే పిల్లలకు ఆహారాన్ని తయారు చేసి, బంధువుల పెళ్లికి వెళ్లానని కుక్ సుజాత పేర్కొన్నారు. రెండు ప్యాకెట్ల రాగి పిండిని నెలంతా 28 మంది విద్యార్థులకు సర్దుబాటు చేసేలా హెచ్ఎం చెబుతారని, ఎప్పటిలాగే ఈరోజూ తయారుచేశానని వివరించారు. రాగి పిండి మంగళవారంతో అయిపోయిందని గ్రామస్తుల ఎదుట వాపోయారు. రాగి పిండి కాల పరిమితి ముగిసి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. పాఠశాలలో కనీసం రాగి పిండి ప్యాకెట్లు లేకపోవడం గమనార్హం. ఉదయం సుమారు 10 గంటలకు సంఘటన జరగ్గా, హెచ్ఎం గోప్యంగా ఉంచటంతో, మధ్యాహ్నం రెండు గంటలకు కానీ ఉన్నతాధికారులకు విషయం తెలియలేదు. సమాచారం అందుకున్న ఎంఈవో సత్తి సత్యకృష్ణ, సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, దళిత నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు, వైద్య సిబ్బంది పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. హెచ్ఎం వరలక్ష్మి తీరుపై ఎంఈవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే ఆనందరావు, ఆర్డీవో కె.మాధవి, డీఈవో సలీం బాషా, ఎంఈవో కిరణ్‌బాబు పరామర్శించారు.

విధుల నుంచి తొలగింపు

ఈ సంఘటనపై డీఈవో సలీం బాషా మాట్లాడుతూ, కుక్ ఇంటి వద్ద ఆహారం తయారు చేసుకుని రావడం వల్ల ఫుడ్ పాయిజన్ జరిగిందని, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు కుక్‌తో పాటు హెల్పర్‌ను విధుల నుంచి తొలగించామని ప్రకటించారు. దీనిపై స్థానిక కూటమి నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయని గ్రామంలో చర్చించుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పెదపూడి: ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణకు సాయం చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఉదంతమిది. ఎస్సై రామారావు వివరాల మేరకు, కైకవోలు గ్రామంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శివాలయం వద్ద విద్యుద్దీపాల అలంకరణ చేస్తున్నారు. ఈ ఏర్పాట్లకు స్థానికుడైన జీకే విశ్వేశ్వరరావు(22) సాయం చేస్తున్నాడు. విద్యుత్ తీగ తగలడంతో అతడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని పెదపూడి సీహెచ్‌సీకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి చక్రరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మండపేట: పట్టణంలోని మెహర్‌బాబా స్కూల్ ఎదురుగా ఉన్న పెద్ద కాలువలో సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం కనుగొన్నారు. సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడు. స్పైమన్ అని రాసి ఉన్న నలుపు జీన్స్ ప్యాంట్, పింక్ పొడవు చేతుల గళ్ల చొక్కా మృతదేహానికి ఉన్నాయి. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ దారం సురేష్ తెలిపారు.

క్వార్టర్స్ దశలో హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆలిండియా సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో కోకనాడ స్పోర్ట్స్ క్లబ్ పర్యవేక్షణలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీస్ హాకీ పోటీలు మంగళవారం క్వార్టర్స్ దశకు చేరాయి. మధ్యప్రదేశ్‌పై సెంట్రల్ సెక్టార్, ఛత్తీస్‌గఢ్‌పై ఆంధ్రప్రదేశ్, కేరళ సెక్టార్‌పై రాజస్థాన్ సెక్టార్ విజయం సాధించాయి. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, కోకనాడ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు రవిచంద్ర, అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ, టోర్నమెంట్ కమిటీ సభ్యులు మ్యాచ్‌లను తిలకించారు.

మృత్యువు విడదీయని స్నేహ బంధం

- ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- పోలీస్ స్టేషన్ ఎదుట మృతుల బంధువుల ఆందోళన


ముత్యాలరావు, వెంకటేష్(ఫైల్)


ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు, బైక్

ధవళేశ్వరం: వారిద్దరూ స్నేహితులు. కలిసిమెలిసి తిరుగుతూ.. జీవితానందాన్ని ఆస్వాదిస్తున్న వారిని మృత్యువు అమాంతం మింగేసింది. ఆ మృత్యువు కూడా ఆ స్నేహితులను విడదీయలేకపోయింది. ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ధవళేశ్వరం జాలరుపేటకు చెందిన యువకులు నాగమల్లి ముత్యాలరావు(18), బొడ్డు వెంకటేష్(16) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30కు రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజోలు నుంచి రాజమహేంద్రవరానికి వెళుతోంది. ధవళేశ్వరం కాటన్‌పేట సమీపంలో ముత్యాలరావు, వెంకటేష్ మోటార్ బైక్‌పై వెళుతూ ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయారు. అదుపుతప్పి కిందపడడంతో వారి తలలపై నుంచి బస్సు వెనుక చక్రాలు దూసుకెళ్లి, అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జాలరుపేట వాసులు, స్థానికులు కలిసి సంఘటన స్థలంలో ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. దీంతో వేమగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను హైవే మీదుగా, రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలను ఐఎల్‌టీడీ జంక్షన్ నుంచి మళ్లించారు. ఆందోళన చేస్తున్న మృతుల బంధువులతో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చర్చలు జరిపారు. వ్యక్తిగతంగా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ అధికారులు రూ.15 వేల చొప్పున ప్రకటించారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ వ్యక్తిగతంగా రూ.10 వేల చొప్పున డీఎస్పీ భవ్య కిషోర్ చేతుల మీదుగా అందజేశారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు గణేష్, కె.మంగాదేవి, వెంకటేశ్వరరావు, ఎస్సైలు క్రాంతికుమార్, హరిబాబు తదితరులు బందోబస్తు నిర్వహించారు. చిన్న వయసులోనే యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. జాలరుపేట ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260